# శ్రేయోభిలాషుల అభిలాషలు

ఆఫీసు జవాను ఆ రోజు వొచ్చిన ఉత్తరాలను డ్రాయరు మీద పెట్టి వెళ్ళాడు. సెక్షను సూపరింటెండెంటు సోమయాజులు కళ్ళజోడు సర్దుకొని ఉత్తరాలను చూడ సాగాడు. మబ్బురంగు కవరూ, దానిమీద దస్తూరీ – అతన్ని విశేషంగా ఆకర్షించి, ముందుగా ఆ కవరు చించేవరకూ మనస్సు వూరుకోలేదు.

పాలమీగడలాంటి కాగితంపైన నల్లపూసల్లాంటి అక్షరాలు.

"శ్రీ సోమయాజులు గారికి —

"నమస్కారములు! మీరు అన్యథా భావించకుంటే, మనస్సు పాడుజేసుకోకుంటే మీకో రచ్చకెక్కని రహస్యాన్ని చెబుతాను. అది మీజీవితానికీ, పరువు ప్రతిష్ఠలకీ సంబంధించి నది! మూడేళ్ళక్రితం హైద్రాబాద్‌లో, హిమయత్ నగర్‌లో

మీ ఇంటిప్రక్కన యింట్లో యెకౌంటెంట్ జనరల్ ఆఫీసులో పనిచేసే ఉద్యోగి సీతారామారావు ఉన్నారు. జ్ఞాపకం ఉన్నదా! అతను యిప్పుడు విశాఖపట్టణంలో ఉంటున్నాడు. అతను మీకూ, మీ కుటుంబానికీ యెంతో సన్నిహితుడని వేరే వ్రాయనక్కర్లేదనుకుంటాను. అక్కడ ఉండగా అతను మీ యింటికి నిత్యమూ రావటమూ, మీరు వాళ్ళ యింటికి పోవటమూ జరుగుతూ వుండేదికదూ! రెండు కుటుంబాలూ చాలా జోస్తీగా వుండేవని ఆ వీధిలో వాళ్ళు అనుకునేవాళ్లు. సంవత్సరంన్నర క్రితమే సీతారామారావుకి విశాఖపట్టణం బదిలీ అయింది. అప్పటికే మీ చిన్నఅబ్బాయి రాము ఆరు నెలల పిల్లవాడు. కాని, ఒక చిన్న రహస్యం! ఈ పాటికి మీరు గ్రహించే వుంటారనుకుంటాను. గ్రహించలేనంత అమాయకులు మీరైతే — నేనే చెబుతున్నాను: వినండి! మీ చిన్న అబ్బాయి రాములో సీతారామారావు పోలిక లున్నాయి. ఇవాళ యింటికి వెళ్ళి పరీక్షగా చూడండి. ఈ రహస్యం తాలూకు బలం మీకే బోధపడగలదు. ఏమంటారు?

—మీ శ్రేయోభిలాషి."

సోమయాజులకు ఆ ఉత్తరం సాంతం చదవటంతో గుటక మ్రింగుడు పడలేదు. నిశ్చేష్టుడై కొయ్యకుర్చీకి అల్లాగే అంటుకుపోయాడు. కనురెప్పలు వాల్చని కనుగుడ్లు అల్లానే ఎదురూగ్గాఉన్న గోడకేసి చూస్తూ వుండిపోయినయ్. పైన సీలింగ్ ఫాన్ తిరుగుతూన్నా, అతను ధరించిన నైలానుషర్టు చెమటతో తడిసింది.

కళ్ళజోడు తొలిగించి మళ్ళీ చదివాడు ఆ ఉత్తరాన్ని సోమయాజులు. అదే విషయం! అదే రహస్యం! ఎవ్వరీ శ్రేయోభిలాషి?

సోమయాజులు మస్తిష్కపు లేబరేటరీలో -పరికరాలు పగిలిపోయాయి. బుర్ర వేడెక్కింది. నిలువుగుడ్లు పడిపోయాయి. మనిషి కోపంతో, ఉద్రేకంతో, ఆవేశంతో, అవమానంతో వూగిపోతున్నాడు. ఆ ఉత్తరాన్ని నలిపి ఉండగాచుట్టి డ్రాయరుక్రిందనున్న చిత్తుకాగితాల బుట్టలో వేశాడు. కాని, మరునిముషంలోనే ఆ బుట్టలోంచి ఆ వుండను తీసి — అక్షరాని కో ముక్క చొప్పున చింపి ఆ బుట్టలోనే వేశాడు. జవాన్ చేత మంచినీళ్ళు తెప్పించుకు త్రాగాడు. అప్పటికి మనస్సు ఓ దారికి రాలేదు. కుర్చీలోనే అరచేతితో నుదురుపట్టుకుని ఆలోచించ సాగాడు. సెకండ్లు, నిముషాలు... గడిచిపోతున్నాయి. సోమయాజుల మనోఫలకంపైన చిన్నకొడుకు రాముా, సీతా రామారావుల చిత్రరూపాలు ఒకదానిప్రక్క ఒకటి నిలబడ్డాయి. ఆ రూపాల్లో పోలికలు యెంతమటుకు దగ్గరగా ఉన్నాయో – మనస్సు అతివేగంగా వెతుకుతూంది. చిన్నబ్బాయి రాము ముక్కు గ్రద్దముక్కు లాంటిది; సీతా రామారావు ముక్కు – గ్రద్ధముక్కు లాంటిదేనా! అవును! అవునా? కాదు. కాకూడదు! కాదు కూడా. అతనుముక్కు గ్రద్దముక్కంత వాడిగాలేదు. చివర కొంచెంలావు. మరి సీతా రామారావు కళ్ళు, చిన్నబ్బాయి కళ్ళలాగా పెద్దవేనే! పెద్దవేనా? అవును. పెద్దవే! అయితే...! ఛీ. ఛీ. తన మనసారా ప్రేమిస్తూన్న భార్యనే శంకిస్తున్నాడు. ఇంతకంటె అన్యాయం

ఉందా? శారదకు తనంటే గాఢమైన ప్రేమ; ఆమె జీవితపు వెలుగ్గా తననే భావించింది. కష్టాల్లో, సుఖాల్లో తనతో పాలు పంచుకొని, తనద్వారా జీవితాన్ని సార్థక పర్చుకుందామన్న ఆశయంతో తనజీవితంలో అడుగుపెట్టిన స్త్రీ ఆమె. తనుఆమె నైతిక విలువల్ని శంకించడం సబబుకాదు. కాని... కాని మరి యీ లేఖ ఏమిటి? ఇందులో నిజం ఎంతవరకు? తను నిర్ధారణ చేసుకోలేదూ! ఎట్లా నమ్మటం ఆడవాళ్ళను? గుట్టు చప్పుడు కాకుండా సంసారం చేస్తూనే యిద్దరు ముగ్గురు పిల్లలు కలిగాకనే, పరాయి మగవాళ్ళతో లేచిపోయే స్త్రీలను తను చూడటం లేదూ! రాజమండ్రిలో సుబ్బరామయ్యభార్య ఏం చేసింది? కట్టుకొన్న మొగుడ్ని, కన్న ముగ్గురుపిల్లల్ని 'కర్మ'కు వొదిలి .. ఇంటిప్రక్క కుర్రాడితో హైద్రాబాద్ లేచి వెళ్ళి, నెల గడిచాక కొంపకు చేరలేదూ! ఏలూరు వెంకటప్పయ్య చెల్లెలూ! ఆమె అంతే! కాలేజీలో చదువుతున్న పిల్లవాడికి వంటజేసి పెట్టేందుకు వెళ్ళి, అద్దెకున్న ఇంటిఆసామి ప్రేమలో పడి — కులాన్ని గోత్రాన్ని కూడా ఖాతరు చేయకుండా కడుపు తెచ్చుకోలేదూ? లోకం పోకడ అల్లాఉంది. నిప్పు లేకుండా పొగ రేగుతుందా? శారదా, సీతారామారావుల మధ్య యేదో కుంభకోణం జరిగే వుంటుంది. తను సహించరాదు. తన తాత ముత్తాల తరాలనుంచీ వంశంలో ఆడది నీతి చెడడమంటూ లేదు. నిప్పులాంటి వంశానికి ఈ నాడు శారద తన భార్యగా వొచ్చి, తనకు ఆదర్శ సతిగా వెలుగుతూ, సంఘంలో పరువూ, ప్రతిష్ఠలూగల తనకు, ఉద్యోగపు హోదాలో 'మంచివాడు' అనిపించుకున్న తనకు — అప

ఖ్యాతి తెస్తుందా? యెంత ఘోరం! తను క్షణం ఉపేక్షించ రాదు. దురదృష్టవశాత్తు ఆస్తి హరించుకు పోయినా భరించ వచ్చుగాని — భార్య అవినీతిని ఏ భర్త సహించగలడు? —ఇలాంటి ఆలోచనలతో సోమయాజులు మనస్సు కొరకొర లాడుతూన్న సమయంలో. చేతిలో, ఫైళ్ళతో అప్పర్ డివిజన్ క్లర్కు ఆనంద కుమారస్వామి యెదురుగ్గా — నిలబడి 'సార్!' అన్నాడు.

నిద్రబోతూన్న పెద్ద పులిని గులకరాయి వేసి నిద్ర లేపినట్టుగా, మెర మెరలాడే అవమానంతో, అనుమానంతో సతమత మవుతూన్న సోమయాజుల్ని అప్పర్ డివిజన్ క్లర్కు ఆనందకుమారస్వామి 'సార్!' అని పిలిచి, నోటి దుడుకుకూ. కంటి తాకిడికీ గురైనాడు,

సెక్షను సూపరిండెంటు సోమయాజులు ఆఫీసులో ఆ పైన అరగంట కూడా కూర్చోలేకపోయాడు. చేతిలోంచి జారి గడపమీదపడి ముక్కలైన గాజుగ్లాసులాగైంది మనస్సు. ఆ ముక్కల్లో - నీతిలేని శారదా, అందుకు కారకుడైన మిత్ర ద్రోహి సీతా రామారావూ, వాళ్ళ అవినీతి చొక్కాని కప్పు కొని - దృష్టాంతంగా నిలిచిన రామూ, శ్రేయోభిలాషీ బాగాలుగా అగపడ్డారు తల నొప్పిగా వుందని, సోమయాజులు వేగిరం రిక్షాలో హిమయత్ నగర్‌లోని తన యింటి కొచ్చాడు.

పడక గదిలో పట్టెమంచంమీద భార్య శారద- రాజ ప్రాసాదంలోని రాణిలాగ నిశ్చితంగా నిద్రిస్తోంది. చిన్న

బ్బాయి రాము తివాచీమీద కూర్చుని రబ్బరు బొమ్మలతో ఆడుకుంటున్నాడు. బూట్లు విడిచి పడక గదిలోకి ప్రవేశిం చాడు సోమయాజులు. తండ్రిని చూడటంతోనే రాము వొచ్చీరాని మాటలతో కేరింతలు కొడుతూ, రెండుచేతులు పైకెత్తాడు - ఎత్తుకోమని.

సోమయాజులు అల్లాగే నిలబడి అయిదు నిముషాల సేపు - చిన్నబ్బాయి రాముకేసి చూశాడు.

ముక్కులో తేడా ఉంది.

కళ్ళు - ఇద్దరివీ పెద్దవే!

సీతారామారావు గడ్డం చిన్నది; ముఖానికి సరిపడి నంత గడ్డం. చిన్నదిగానే అగపడుతూంది! బుగ్గలు లావుకావ డం చాత అల్లా అగపడుతున్నదేమో! చెవులు? చెవులు కూడా అతని చెవుల్లాగా ఉన్నాయా? అల్లాగేఉన్నట్లున్నాయి మరి. పిల్లవాడు యెదిగితే మార్పు వొస్తుందేమో! మొత్తం మీద శ్రేయోభిలాషి చెప్పిన ప్రకారం అబ్బాయిలో సీతా రామారావు పోలికలున్నాయా? లేవా? కొన్ని పోలిక లున్నాయి, కొన్ని లేవు. ఎట్లా ఒక నిర్ణయానికి రావటం? అసలు ఏ పాపమూ యెరక్కపోతే, కొన్ని పోలికలు మటుకెం దుకు రావాలి? తను భ్రమపడుతున్నాడేమో! అసలు పోలి కలు లేవేమో! లేకుంటే శ్రేయోభిలాషి ఎందుకు వ్రాస్తాడు? అదీ నిజమే! సందేహం లేదు. శారద తనని మోసగించింది. అవినీతికి పాల్పడింది. వాస్తవం రాము తన కొడుకుకాదు. సీతారామారావు రక్తాన్ని పంచుకొని పుట్టినవాడే! లేకపోతే,

శారద వాడికి నామకరణం చేసే విషయంలో 'రామచంద్ర మూర్తి' అనే పేరు పెట్టాలని అంత పట్టుపట్టాల్సిన అగత్య మేముంది? తన ప్రియుడిపేరు కొడుక్కి పెట్టుకోవటంలో ఆమె కంతమోజు దేనికి? తనకు బోధపడింది. శారద నిజంగా గడ్డి తిన్నది. వంశానికీ, తన పేరు ప్రతిష్ఠలకీ యెంత అపకీర్తి తెచ్చింది! దాన్ని యేం చేయాలి? ఏం చేస్తే పాపం ఉంది?

సోమయాజులు గుండె మండి పోతున్నది కోపోద్రే కంతో. పట్టెమంచందగ్గర కెళ్ళాడు. 'ఈ పళంగా దానిగొంతు చచ్చేవరకూ నులిపితే!' అన్న ఆవేశం ఒరనుండి దూసిన కత్తిలాగ వొచ్చింది. కాని, అప్పుడు ఆ పని చేయలేదు సోమ యాజులు.

అతను ఒకనిర్ణయాని కొచ్చాడు. తన భార్యకూ, మిత్రుడు సీతా రామారావుకీ మధ్య నడిచిన ప్రణయ సన్ని వేశాలకు సంబంధించిన ఆ చూకీ సమగ్రంగా సంపాదించాలి. అవివేకంగా, ఆవేశపడి ముందుకు ఆమెను యెల్లాంటి అను మానం కలక్కుండా ప్రవర్తించాలి. వాస్తవాన్ని తెలుసు కున్న తర్వాతనే తను ఏం చేసినా...

శారద మధ్యాహ్నం రెండు గంటల పదిహేను నిమి షాలకు నిద్రలేచింది. భర్త కుర్చీలో అరచేతిలో నుదురు పట్టుకు కూర్చోడం — ఆమె నిద్రమత్తు కళ్ళకు విపరీతమైన విడ్డూరాన్ని కనిగించింది.

"ఎంత సేపైందండి వొచ్చి?" అన్నది పైట సరు కొంటూ.

శారద ముఖంలోకీ, నేరస్థుని ముఖం వంక న్యాయాధికారి చూసినట్టు చూశాడు సోమయాజులు. ఆ చూపులోని అంతరార్థం ఆమెహృదయానికి అంతుపట్టలేదు.

"ఒంట్లో బావుండలేదా?"

"బావుండకేం!" బడి గంటలాగ గొంతు ఖంగున మ్రోగింది.

శారద మనస్సు త్రుళ్ళిపడింది. భర్తకేసి దృష్టి నిలిపి చూసింది. మంటలో ఉప్పు వేసినట్టుగా చిటపట లాడుతోంది ముఖం. కారణ మేమిటి? ఆమె వూహించలేకపోయింది. అట్లాంటి స్థితిలో అడిగి తెలుసుకోవడంకూడా ప్రమాదమేనని భావించి, శారద మెదలకుండా ఊరుకుంది.

ఆ రాత్రి గడిచింది. సోమయాజులు భార్యతో ఆ విషయమై నిర్మొహమాటంగా యేమీ ప్రస్తావన జరుపలేదుగానీ, సాధ్యమైనంతవరకూ ఆమెవంక చూస్తూనే — ఆమె ప్రవర్తనలోని మెలికదనాన్ని గ్రహించేందుకు ప్రయత్నాలు జరిపాడు. తన పిచ్చి కాకపోతే, ఎప్పుడో స్థితిలో తప్పటడుగు వేసిన మనిషి ముఖంలో యివాళ పరీక్షగా చూస్తేమటుకు ఆ క్షణాలు అగుపడతాయా?

మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు ఓ టెలిగ్రాం వొచ్చింది సోమయాజులకు. అది నిజమాబాద్‌నుంచి తోడల్లుడు యిచ్చింది. శారద అక్కయ్యకు కాన్పు కష్టమైతే

ఆస్పత్రిలో చేర్పించారుట. పరిస్థితి కొంచెం ఆందోళనకరం గానే ఉందట. ఆ టెలిగ్రాం చూడటంతో శారద గుండె రబ్బరు బంతిలాగ కొట్టుకుంది. సత్వరం నిజామాబాద్‌కు ప్రయాణం కట్టింది. భర్తనుకూడా వెంట రమ్మన్నది కానీ, సోమయాజులు వెళ్ళలేదు. ఏవో సాకులు చెప్పాడు. "నువ్వు వెళ్ళితే చాలులే! నాకు ఆఫీసులో అర్జంటు పనులున్నాయి. అంతగా అవసరమైతే రేపు బయలుదేరి వస్తాలే." అన్నాడు.

"కాని, సోమయాజులు ఆ రోజు ఆఫీసుకు వెళ్ళలేదు. శెలవు పెట్టాడు. ఎంతో ముందు ఆలోచనతోనే సెలవు పెట్టాడు. అతని ఆలోచనలకు తగినట్టుగానే భార్యకు హాఠాతుగా ప్రయాణం తగిలింది. ఆమె తిరిగి వొచ్చేలోపుగానే – ఇల్లంతా గాలించి, సీతారామారావు – ఆమె మధ్య నడిచిన ప్రయాణంతాలూకు ఆధారాలు యేవైనా బయటపడతాయేమో చూద్దామనుకున్నాడు. అవకాశం కూడా తలుపులు తెరుచుకొని వీలుగా ఉంది.

భోజనం ముగించిన పిదప, ఆ ప్రయత్నానికే సోమయాజులు తలపడ్డాడు. ముందుగా ఆమె చీరెలపెట్టె తెరిచాడు. తాపీగా కూర్చుని ఒక్కో చీరెచొప్పున అన్నిచీరెలూ బయట పెట్టాడు. షిఫాన్, మైసూరుసిల్కు, నైలాన్, గద్వాల్ చీరెల మడతలు నలగకుండా — అన్ని చీరెల మడతల్లోకీ వ్రేళ్లు పోనిచ్చి వెతికాడు. ఏమీ లాభంలేకపోయింది. అతను ఆశ పడింది–వాళ్ళిద్దరిమధ్య యేమైనా ఉత్తరాలు నడిచివుంటాయనీ, వాటిని జ్ఞాపకచిహ్నాంగా భద్రంగా దాచిపెడుతుందనీ!

అల్లాంటి ఉత్తరాల పత్తా లేకపోయేప్పటికి — సోమయాజుల ముఖం యెండకు వాడిన పువ్వులాగ ముడుచుకుపోయింది. పెట్టె అడుగున పరచిన కాగితాన్నికూడా పైకి తీశాడు.

అతనికళ్లు ఒక్కసారి ఆసక్తిగా అంతకు రెండింతలైనాయి. ఇల్లాలి రంకుతనం దొరికిపోయినట్టుగానే భావించాడు. చెట్టునఉన్న ఆఖరి ఆకు పెనుగాలికి అల్లల్లాడినట్టుగా అతనిగుండె కొట్టుకులాడింది. తెల్లటి జేబురుమాలు చుట్టబడ్డ ఉత్తరాలకట్ట పైకితీశాడు, అన్నీ సీతారామారావు వ్రాసిన ఉత్తరాలేనా అనుకుంటూ. సోమయాజులుగుండె దిటవు జేసికొని మెల్లగా జేబురుమాలు తొలిగించి, పై ఉత్తరాన్ని చూశాడు. మనస్సు చివుక్కుమన్నది; ముఖం సిగ్గుపడ్డది; పెదాలు కదిలాయి; తనకుతానే అప్రయత్నంగా చిరునవ్వు నవ్వుకున్నాడు సోమయాజులు. ఆ ఉత్తరాల లన్నింటినీ తనే, శారదతో వివాహం జరిగాక యూనివర్సిటీలో చదువుతూ — ప్రేమగా వ్రాశాడు. ఆ ప్రేమ లేఖలనే శారద జాగ్రత్తగా దాచింది. తనంటే శారదకు నిజంగా యెంత ప్రేమ, భక్తి, అభిమానం! ఛీ, ఛీ, తనే ఒక అనుమానపుమనిషి. మరి ఆ శ్రేయోభిలాషి లేఖసంగతేమిటి?

సోమయాజులు అంతటితో పరిశోధన ముగించక — బీరువాలు, అల్మరాలు, పుస్తకాల షెల్ఫులూ, వంటగదీ, డ్రాయరుల సొరుగులూ అన్నీ వెతికాడు. కాని, కావాల్సిన ఆ చూకీ రవ్వంతకూడా చేతికి చిక్కలేదు. ఆఖరికి బీరువాల పైన, గోడల పైన బూజుపట్టిన సామాగ్రి తాలూకు బూజు

కూడా దులిపాడు; ప్రయోజనం పిసరంతకూడా లేకపోయింది. గ్లాసెడు మంచినీళ్ళు త్రాగి, ముఖాన్ని టర్కీటవల్‌తో శుభ్ర పరుచుకొని, అద్దంలో చూచుకొనే ధైర్యంలేక ఇంత సెలవూ పెట్టి, ఇంతసేపూ వెతికి, కొండను త్రవ్వి ఎలుకను కూడా పట్ట లేదే అన్న విసుగుతో పడకగదిలో పట్టెమంచంమీదకూర్చు న్నాడు సోమయాజులు. మళ్ళీ ఒక్కసారి యింట్లో ఉన్న తావులు, తాను పరిశోధించిన ప్రదేశాలు మనస్సులోకితెచ్చు కున్నాడు. పరిశోధన ముగింపుకొచ్చినట్టే భావించాడు. కాని, ఉండి ఉండి అలసిన మనస్సులో ఒక్క ప్రదేశం పొడుచు కొచ్చింది. అదే పట్టెమంచం! గబుక్కున పట్టెమంచం పరుపు క్రింద వెతికాడు. 'సుకసప్తతి కథలు' అనే ఓ పుస్తకం దొరి కింది. దాన్ని అనాలోచితంగానే పేజీలు తిరగవేశాడు; అద్భుతమైన రహస్యం, పరిశోధనతాలూకు ఫలితం—బయట పడింది. ఆ పుస్తకంలో సీతారామారావు ఫోటో ఉన్నది.

పరాయి పురుషుడిఫోటో పుస్తకంలో నిక్షిప్తపరచి, దంపతులు శయనించే పట్టెమంచం పరుపుక్రింద యెందుకు పెట్టాలి? తను లేనప్పుడు శారద ఆ ఫోటోని చూసి, వాడ్ని మనస్సులో మెచ్చుకుంటూ ఉంటుందా? వాడితో గడిపిన మధురానుభూతుల్ని నెమరుకు తెచ్చుకుంటూ ఉంటుందా? ఎంత దారుణం! స్త్రీజాతి ఎంత అధఃపాతాళానికిదిగజారింది! కాలంలో, దేశంలో జరిగే మార్పు అవినీతికి దారి తీస్తు న్నదా? ఈ సినిమాలు, ఫాషన్లు, నవలలు, నూతనత్వం, సౌకర్యాలు, అవకాశాలు — వ్యక్తిత్వపు విలువల్ని నైతి కంగా తగ్గిస్తున్నాయా? ఎట్లా నమ్మటం? అగ్నిసాక్షిగా పెళ్ళి

నాడు మెన్నో ప్రమాణాలు చేసిన భార్యే, పిల్లలున్న తల్లే, సంసారమూ, సంఘమూ, లోకం తీరూ — అన్నీ తెలిసిన యిల్లాలే, జీవితానికి తలమానికం వంటి నీతి విషయంలోనే యింత అశ్రద్ధ కనబరుస్తూంటే — ముందు ముందు భారత దేశం యేంకాను? తను ఎంతమాత్రం శారదను క్షమించ రాదు. క్షమిస్తే—తనూ అవినీతిని ఆరాధించినట్లే అవుతుంది. దానిచేత, దాని నోటిమీదగానే నిజాన్ని కక్కించాలి. నిజం చెప్పకుండా, కన్నీరు ధారగా కార్చినా తను కరుణ చూప రాదు; హృదయాన్ని పాషాణ సమం చేసికొని - దాని అవి నీతిని దానిచేతనే బయటపెట్టించి, పాప ఫలితం తెలిసి వొచ్చేట్లు చేయాలి. భార్య వొచ్చేవరకూ సోమయాజులు చిందులు త్రొక్కుతూనే ఉన్నాడు. ఆఫీసుకు సెలవుపెట్టాడు. నిద్రలేదు: ఆహారంమీద మనస్సుపోవటంలేదు. కళ్లు యెఱ్ఱ బడ్డాయి. మెదడు బండబారింది. అదే ఆలోచన! అదే నిర్ణ యం! అదే కోపం! గుండెల్లో అదే దిగులు!

మూడోనాడు సాయంత్రం నిజమాబాద్‌నుంచి శారద వొచ్చింది. భర్త వాలకాన్ని చూసి విస్తుపోయింది. "ఎల్లా వుంది మీ అక్కయ్యకు? సుఖంగా ప్రసవించిందా? ఆడపిల్లా, మగపిల్లవాడా," అని ఆదుర్దాగా అడగలేదు సరికదా, "అప్పుడే వొచ్చావేం, ఇంకా నాలుగురోజు లుండకపోయి నావా" అని దెప్పిపొడవలేదు కూడా. పైగా ఆయనగారి ముఖం సలసల కాగే నూనెలో నీటిచుక్క పడ్డట్టుగా వున్నది. అందుకు కారణాన్ని ఆమె ఊహించలేకపోయింది. భర్త, తన కేసి నేరం చేసిన వ్యక్తివంక పోలీసు ఉద్యోగి చూసినట్టు

చూడటం — ఆమెకు ఎక్కువ భయాన్ని కలిగించింది. చివరకు ఎల్లాగో ధైర్యం చేసికొని—

"ఏమిటండీ, అలా ఉన్నారు?" అన్నది శారద.

"నేనా నువ్వా?" కంచుగంట ఖంగుమన్నట్టుగా అన్నది అతనిగొంతు. సమాధానం కోసం ఆమె సతమతమైంది.

"నీ వేషాలు, వినయాలు, చేష్టలు అన్నీ బయట పడ్డాయి. నువ్వు యింత ద్రోహివని, కట్టుకున్న మొగుడు కళ్ళల్లో కారంజల్లే నెరజాణవని కలలో కూడా తలచలేదు. చెప్పు. సీతారామారావుకూ, నీకూ ఉన్న సంబంధం నిజం కాదా? మన చిన్నబ్బాయి రాము ఆ సంబంధం తాలూకు వాడుకాదూ? ఈ రహస్యం రచ్చకెక్కింది. లోకమంతటికీ తెలిశాకనే నాకు తెలిసింది. ఎంత అవినీతికి పాల్పడ్డావే! వంశం, హోదా, పరువూ-ప్రతిష్ఠల్ని నిలువుగా మంటగలిపి వేశావ్! నిన్ను యేం చేస్తే పాపం వుంది? చెప్పు... నిజమని యిప్పటికైనా ఒప్పుకుంటావా?" వొళ్ళంతా ఆవేశాన్ని నింపుకొని, కళ్ళనిండా కోపోద్రేకం పొగలు కక్కుతుండగా, సహారా ఎడారిలో - ఇసుక తుఫాను లేచినట్టుగా మాట్లాడాడు సోమయాజులు.

ఆ మాటల్లో ఒక్కటీ అర్థంగాక భర్త ఆవేశాన్ని, నేత్రాల్లోని కోపోద్రేకాన్ని చూసి—శారద, గుండెను గాజుపెంకుతో గీరినట్లై, కన్నీళ్ళతో కుప్పలాగ కూలబడింది.

"నేను ఏ పాపమూ ఎరుగను! ఎవరో గిట్టనివాళ్ళు

కల్పించి మీ మనస్సు చెడగొట్టారు. పవిత్రమైన ఈ మంగళ సూత్రం సాక్ష్యంగా చెబుతున్నాను. నేను అవినీతి పరురాల్ని కాదు. సీతారామారావుకీ నాకూ యెలాంటి సంబంధమూ లేదు. చిన్నబ్బాయి రాము మీ రక్తాన్ని పంచుకొని పుట్టిన వాడే! మీరు అనవసరంగా అనుమానించి బాధపడు తున్నారు: వంశ ప్రతిష్ఠకూ, కుటుంబ గౌరవానికీ, మీ హోదాకూ, నా స్త్రీత్వపు విలువకూ — భంగం కలిగే చెడుపని నేను యేమీ చేయలేదని భగవంతునిసాక్షిగా చెబు తున్నాను. మీరు నా మాటలు నమ్మండి," అన్నది శారద, కన్నీళ్ళు చంపలక్రిందికి దిగజారగా — దుఃఖం గొంతులో గడ్డ కట్టగా.

కాని, ఆమె యేడ్పు అతని గుండెకు తాకలేదు; ఆమె మాటలు అతని మెదడుకు చేరలేదు; ఆమె దుఃఖం అతనిలో పరివర్తనకు మార్గాన్ని యేర్పర్చలేదు.

"ఛీ. కులటా! ఇంకా పైపెచ్చు అబద్ధాలాడి ఆత్మ రక్షణకోసం ప్రయత్నిస్తున్నావా? నీ సంగతి అంతా గ్రహిం చాను. నీ ప్రణయ సన్నివేశాల్ని పరిశోధించాను. అతనిమీద నీ కెంతప్రేమ, అభిమానం, మోజు లేకపోతే — అతని ఫోటో నీ దగ్గర దాచుకుంటావ్? ఇదుగో, ఈ పుస్తకంలో సీతా రామారావు ఫోటో! ఇప్పటికైనా ఒప్పుకుంటావా. నీచు రాలా!" సోమయాజులు గొంతు జీరపోయింది.

"ఆ ఫోటో ఆ పుస్తకంలో ఉన్నవిషయం నాకు ఏమీ తెలీదండి. సత్యప్రమాణంగా చెబుతున్నాను. ఆ పుస్తకం

సీతారామారావుగారి భార్య సత్యవతిది. చదువుకోనేందుకు తీసికున్నాను. మళ్ళీ యివ్వడం మర్చిపోయాను. అది ఎక్కడున్నదో కూడా నాకు జ్ఞాపకంలేదు," అన్నది శారద భయోద్విగ్న మనస్కురాలై.

"నీకు తెలీదేం? ఏమీ తెలీకుండానే ఆ పుస్తకాన్ని, ఫోటోనూ పడకగదిలో పట్టెమంచం పరుపుక్రింద దాచావా. ఎంత నంగనాచివే!... ఈ బరితెగిపోయిన ప్రవర్తనను నేను సహించను. ఏమనుకుంటున్నావో – నిజం చెప్పు! మీ ఇద్దరికీ యెన్నాళ్ళనుంచి సంబంధం ఉంది? నువ్వింత అవినీతి కూటికి పాల్పడటానికి కారణమేమిటి." సోమయాజులు ప్రళయకాల రుద్రుడై వేసే ప్రశ్నలకు శారద, పగిలిన కుండనుంచి నీళ్ళు కారినట్లు పగిలిన హృదయంనుంచి ఆవేదన రూపంలో కన్నీరు కార్చడం మినహాయించి సమాధానంచెప్పలేకపోయింది. వ్యక్తి యెంత నిర్దోషియైనా కొన్నిచోట్ల తన నిర్దోషత్వాన్ని నిరూపించుకోగలశక్తినీ, ఆధారాలనూ, వాతావరణాన్నీ, కోల్పోవడం కద్దు. శారద అల్లాంటి పరిస్థితినే యెదుర్కోవాల్సి వొచ్చింది.

ఆ రాత్రి ఆ యింట్లోని వంటగదిలో పొగ రగలలేదు. ఇంటి యిల్లాలు శారద అపవాదు భారంతో అశోకవనమున సీత పగిది కన్నీళ్ళతో ప్రాణం కడబట్టింది. ఇంటి యజమాని సోమయాజులు అవమానపుకోపంతో కలియుగ దుర్వాస మునియై నిప్పులు కక్కుతూ కంటిమీద రెప్ప వాల్చకుండా మేల్కొన్నాడు. ఆకలికి శోషకొచ్చి పిల్లలు కడుపులో కాళ్లు కుక్కుకొని నిద్రపోయారు.

ఆ రాత్రంతా ఆలోచించినా సోమయాజులు ఒక నిర్ణయానికి రాలేకపోయాడు. ఎంత పాటుపడ్డా ఆమె చాత నిజం పలికించలేక పోయాడే తను—అన్న న్యూనత అతనిలో పెద్ద అశాంతికి కారణమైంది. శ్రేయోభిలాషి వ్రాసిన వ్రాసిన లేఖ ప్రకారం, తను జరిపిన పరిశోధనా ఫలితాల ననుసరించి—తన భార్యను ఎందుకు అవమానించరాదోనన్న అభిప్రాయం అతని హృదయంలో గాఢంగా తిష్ట వేసింది. ఆ అనుమానమే అతని ఆలోచనల్లో వంకరదనాన్ని తెచ్చిపెట్టింది. భార్య అవినీతి వల్ల వొచ్చిన అప్రదిష్టను తను అంగీకరించలేడు. తన నిర్మలత, అల్లాంటి విషయాల పట్ల తన కరకుదనమూ, నిర్దోషత్వమూ, విముఖతా – లోకానికి తెలిసిరావాలంటే, తను అవలంబించ వల్సిన మార్గాలు రెండే రెండు: భార్యను యింట్లోంచి వెళ్ళగొట్టడమూ, లేదా – తను యింట్లోంచి, ఉద్యోగానికి రాజీనామా యిచ్చి వెళ్ళటమూ! ఆ రెండు మార్గాల్లో ఏది ఆచరణ సాధ్యమో, అనుచితమో తేల్చుకోలేకపోయాడు సోమయాజులు.

మరునాడు ఉదయం శారద ముందుగా మేల్కొన్నది. రాత్రి తను పిల్లల్ని పస్తుపడుకోబెట్టి నందుకు బాధపడింది. పొయ్యి వెలిగించి, కాఫీ కాచి పిల్లలకిచ్చి, ఒకగ్లాసు భర్త ముందు పెట్టింది. కాని సోమయాజులు ఆ కాఫీకేసి కన్నెత్తి చూడలేదు. బజారుకెళ్ళి’ రెండు యిడ్లీ, సాంబారు, ఒక మసాలాదోసె తిని, కాఫీ త్రాగి, వక్కపొడి నములుతూ రెడ్ అండ్ వైట్ సిగరెట్టు వెలిగించి – ఇంటికి వొచ్చాడు.

తన చేతిమీదుగా యిచ్చిన కాఫీని భర్త త్రాగలేదని–శారద మనస్సు మెలితిరిగింది. చీకూచింతా లేకుండా, వాలుగాలిని నిర్మలంగా వెళ్ళే పడవమాదిరిగా సాగిపోయే సంసారంలో చెలరేగిన తుఫాను ఎంతకాలం వుంటుందో, పరిస్థితులు యింత బిగువుగా ఎంతదూరం వెళతాయో, కొసకు ఫలితం ఎట్లా వుంటుందోనని ఆమె భయపడజొచ్చింది.

ఆరోజు కూడా సోమయాజులు ఆఫీసుకు వెళ్ళలేదు.

ఒకప్రక్క దిగులుతో యిదవుతూనే శారద వంట ప్రయత్నం మొదలెట్టింది.

బయట వరండాలో పడక కుర్చీలో ఆలోచిస్తో కూర్చు న్నాడు, సోమయాజులు ఉదయపు ఎండ ఉత్సాహంగా ఇంటి ముందు గార్డెన్ మీద పడుతోంది. విచ్చుకున్న మందార పువ్వులపైన పడే ఎండ మనోహర దృశ్యానుభూతిని కలిగి స్తోంది. అల్లాంటి ప్రకృతి సౌందర్య దృశ్యాల్ని చూస్తో— ప్రతి ఉదయమూ సోమయాజులు తన్మయత్వం జెందుతూ వుండేవాడు; అతనిలో కళాహృదయం రసానుభూతిని పొందుతూవుండేది. కాని ఆరోజు అతని కళ్ళు అటువంటి దృశ్యాన్ని చూచేందుకు తహతహ లాడలేదు.

రాము రబ్బరు బొమ్మతో ఆడుకుంటూ వరండాలోకి వచ్చాడు.

సోమయాజులు రాముకేసి తీక్షణమైన పరిశీలనా దృష్టితో చూశాడు. ముక్కులో తేడా కనబడుతోంది. కాని,

కళ్ళు – సీతారామారావు కళ్ళలాగా పెద్దవి; గడ్డంకూడా అతని గడ్డంలాగా చిన్నది. మొత్తంమీద అతని ముఖానికీ, రాము ముఖానికి పోలికలు ఎక్కువగా ఉన్నాయా? ఏమో. తను నిర్ధారణ చేసుకోలేక పోతున్నాడు. ఈ వీధిలో వాళ్ళు యీపాటికే గ్రహించారేమో! చాటుగా చెప్పుకుంటున్నారేమో! లేకుంటే శ్రేయోభిలాషి తన కెందుకు వ్రాస్తాడు? వీడు. యీ రాముగాడు తన కళ్ళఎదుట. సీతారామారావు రూపాన్ని ధరించి, చిందులువేస్తో తిరుగుతుంటే – తను భరించగలడా? బ్రతికగలడా? అర్ధాంగి అవినీతికి ప్రత్యక్ష నిదర్శనమైన వీడ్ని తనకొడుగ్గా ఆత్మవంచన చేసుకుంటూ – ఎన్నాళ్ళు పెంచగలడు? ఈ కోపంలో తన హృదయంలో శాంతి నెలకొల్పబడాలంటే వీడి పీడ తప్పించటం కంటే వేరే గత్యంతరంలేదు. ఈ అవినీతిని నామరూపాలులేకుండా చేసిన నాడే తను మామూలు మనిషి అవుతాడు; ఉద్యోగంలో ప్రవేశిస్తాడు!

—సోమయాజులు అప్పుడు అట్లా గాఢంగా నిర్ణయించుకున్నాడు. ఇంట్లోంచి భార్యను వెళ్ళగొట్టాలా?— అన్న సమస్యకు స్వస్తిచెప్పి, ఈ కొత్త ఆలోచనతో మనస్సును బంధించాడు. ఆరోజు హోటల్లో భోంచేద్దా మనుకుంటూనే, ఇంట్లోనే భోజనం చేశాడు. శారద మనస్సుకు కొంత శాంతి ఏర్పడింది.

కాని ఆమె భోజనం చేసి, వంట గదికి గొళ్ళెం పెట్టి, ఇంట్లోకి రాగానే సోమయాజులు ఆమె గుండెలోని గాయాన్ని సూదితో కెలికాడు.

"శారదా! నీచాత నిజం చెప్పించటం నావల్ల కాలేదు. చేసిన అవినీతిని కన్నీళ్ళ చాటున దాచుకోవాలని చూస్తున్నావు. కాని నాకు శాంతిలేదు. నా హృదయం తీరని బాధతో, వేదనతో కుంజుకుపోతోంది. సంఘంతో నాకు గల సంబంధం విశాలమైంది. నా ఉద్యోగపు హోదా, జీవితపు విలువా, వంశ ప్రతిష్ఠా, నీతీ – నిజాయితీ, సంఘంతో నాకుగల సంబంధంతో ముడిపడి ఉన్నాయి. తెల్లవారి లేచింది మొదలు వీధిలోకొచ్చి నలుగురితో వ్యవహారం నడపాల్సిన అగత్యం నాకుంది. కుటుంబంలో ఇట్లాంటి విషయాలు బజారు కెక్కితే – నా వ్యక్తిత్వపు విలువలు నీళ్ళపాలుగాకేముంది? ఈ పిల్లవాడు ఇంట్లోవుంటే, ఆ పాపఫలితాన్ని చూస్తూ–క్షణంకూడా కోపంలో నిలబడలేను. ఉంటే వాడైనా వుండాలి; లేదా నేనైనా వుండాలి. నేను ఆత్మను చిన్నబుచ్చుకోలేను. నీ అవినీతి కార్యపు పిల్లవాడ్ని క్షమించి పెంచి, పెద్దవాణ్ణిచేసే ఓర్పు నాలో లేదు. ఈ రాత్రే వాణ్ణి ఎత్తుకెళ్ళి హుస్సేన్‌సాగర్‌లో కాళ్ళూ చేతులు కట్టి పారవేసి వొస్తాను. శిశుహత్య ఎంత ఘోరపాపమైనా అనుభవిస్తాను కానీ— ఈ అవినీతి ఫలితాన్ని క్షమింపలేను" అన్నాడు సోమయాజులు ఆవేశంతో వొళ్ళంతా చెమటలుకమ్ముకోగా.

ఆ మాటలు వింటూ శారద ఒక్కొక్క దళం త్రుంచబడ్డ పద్మంలా కుప్పగా కూలబడ్డది. ఆ గాఢమైన దుఃఖంలో తన నిర్దోషత్వాన్ని నిరూపించి భర్తమనస్సునూ, నిర్ణయాన్ని మార్చేశక్తి ఆమెలో లేదు. ఆ రోజు కనుచీకటి పడేవరకూ ఆలోచిస్తూనే వున్నది.

ఆయనగారు తన మొర ఆలకించరు. ఒకసారి మనస్సులో నాటుకున్న విషయానికి తిరుగులేదు. అది నిజమైనా_ ఆ అభిప్రాయాన్ని తొలగించుకోరు. ఈ పరిస్థితుల్లో తనేం జేయాలి. ఏ పాపమూ ఎరుగని తనకు విధి ఈ అగ్నిపరీక్ష తెచ్చి పెట్టింది. ఆయనగారి మొండి పట్టుదలకూ, వితండ వాదనకూ, అన్యాయమైన అపవాదుకూ_పిల్లవాడు బలి కావాల్సిందేనా. నూరేళ్లు బ్రతికి దేశంలో ఎన్నో ఘనకార్యాలు సాధించవలసిన కొడుకు పసితనంలోనే పరనిందకు గురియై, ప్రాణాలు దారుణంగా వొదలవల్సిందేనా. పిల్లవాడు హుస్సేన్ సాగర్‌కు బలికావల్సిందేనా. చూస్తూ చూస్తూ ఏ మాతృదేవి తనయుని మరణానికి ఒప్పుకుంటుంది. నవమాసాలుమోసి, కని, ఎన్నో ఆశలతో అనురాగంతో పెంచుకుంటూ, ఏ తల్లి పుత్రుని దారుణ హత్యను ప్రోత్సాహమిస్తుంది. రాము లేకుంటే తను లేదు. ఎల్లాగైనా పిల్లవాణ్ని కాపాడుకోవాలి. ఆయన గుండె విషంతో బండపారిపోయింది. మొండి పట్టుదలతో కన్నకొడుకు హత్యకు వెనుదీయరు. పాప భీతికి వెనుకాడరు. తనే చిట్టితండ్రిని కాపాడుకోవాలి. ఎట్లా? పిల్లవాణ్ని ఇంట్లో లేకుండా చేయడంకోసం ఆఫీసుకు సెలవు పెట్టి, కంకణం కట్టుకున్న ఆయనగారి బారినుంచి తను బాబును రక్షించుకోగలదా. ఇంత అన్యాయం, హింస, పాపం, అధర్మం, అక్రమం _ లోకంలో ఎక్కడైనా ఉందా. ఇతరుల లేఖలు చూసి. అపోహపడి, అపవాదుకు దడిచి _ ముందూ వెనుకా, మంచీ చెడ్డ ఉచితా నుచితాలు యోచించకుండా, కన్నకొడుకునే గొంతు పిసికి నీళ్ళ మడు

గులో వేసే తండ్రి ప్రపంచంలో ఉన్నాడా. ఆయన పట్టుదల కడపరాయి లాంటిది; ఆయన నిర్ణయం ఇనుపముక్క-లాంటిది; ఆయన రెట్టమతం రామబాణంలాంటిది. అట్లాంటి మనిషి దుష్కృత్యం నుంచి తను అబ్బాయిని రక్షించుకోగలదా.

తీవ్రమైన ప్రతీకార వాంఛతో హత్యా ప్రయత్నంలో నిమగ్నుడైన హంతకునివలె, సోమయాజులు ఆ రోజంతా—తల్లి పక్కలోని పిల్లవాణ్ణి ఎలా కిక్కురు మనకుండా తీసుకెళ్ళి రెండోవాడి కంటబడకుంటా, అనుమానానికి అవకాశం ఏర్పడకుండా—హుస్సేన్ సాగర్‌కి అర్పించి రావాలో, ఆలోచించాడు.

ఆరోజు రాత్రి ఆ యిల్లు ఎర్రచొక్కా తొడుక్కుంది. భార్యాభర్తల గుండెల్లో ఎర్రదీపం వెలుగుతోంది. పిల్లవాడు ఎండకు మంచు కరిగినంత నిశ్శబ్దంగా నిద్రించాడు. సోమయాజులు అన్నం తినవల్సి తిన్నాడు గానీ, శారదకు ఆపాటి మెలుకువ లేకపోయింది.

రాత్రి జరుగుతూన్నకొద్దీ సోమయాజుల్లో గుండెదడ జాస్తి, కాజొచ్చింది. ఆ గుండెదడను ఆపుకొనేందుకు వరుసగా సిగరెట్లు త్రాగడం, రేడియో సిలోన్‌లోని పాటలు వినడం, బొమ్మల పుస్తకాలు చూడడం - మొదలుగాగల ప్రయత్నాలు చేశాడుగానీ పాపభీతీ, కన్న ప్రేమ ఆవేశం రూపంలో కట్టలుపొర్లే వరదలాగా వస్తూంటే - ఎల్లా నిభాయించుకోగలడు. శారద పరిస్థితి—ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే గ్రద్ద, భూమిమీద తిరిగే కోడిపిల్లల్ని తన్నుకుపోవా

లనుకుని తహతహలాడుతుంటే పిల్లల్ని రక్షించుకోనేందుకు కోడి పడేపాట్లులాగ ఉంది.

గోడమీద గడియారం పదిసార్లు తల ఆడించింది.

గదిలోని ఫిలిఫ్స్ లైటుకాంతి రవ్వంతన్నా చెక్క చెదరలేదు.

ఇంటి బయట రాత్రి నల్లగా సాగిపోతూంది. కాని ఇంట్లో రాత్రి ఎర్రగా మండుతోంది.

శారద పిల్లవాణ్ని రొమ్ముల్లకు కరిపించుకొని, చుట్టూ చేతులు వేసి— కళ్ళు తెరుచుకొని పడుకుంది. సోమయాజులు పందిరిమంచంమీద పడుకొని ఆమెకేసే చూస్తున్నాడు. ఆమె పక్కలోని పిల్లవాణ్ని తీసికొని — బయటి కెళ్ళవచ్చునని అతని ఆలోచన. అల్లాంటి ఆలోచనతో ఆయనగారు ఆ వర సన కళ్ళల్లో వత్తులు వేసికొని మేల్కొన్నారనే తలంపుతో— ఆమె అట్లా జరిగేందుకు వీలు కలిగించకుండా తాను కళ్ళల్లో నిద్రను పారద్రోలే నిగ్రహశక్తిని పెంపొందించుకుంది.

'ఇంకా ఇది నిద్రపోదేం?' అనుకున్నాడు సోమయాజులు విసుగ్గా.

'ఇంకా వారు నిద్రపోరేం?' అనుకున్నది శారద విసుగు లేకుండా.

తను పొరపాటు పడ్డాడు. అసలు యీ విషయం ముందుగా ఆమెతో చర్చించి వుండవల్సిందికాదు. గుట్టు చప్పుడుగా, చీమ చప్పుడు లేకుండా —. పీక నొక్కితే పోయేది. లేనిపోనిగోల తెచ్చి పెట్టుకున్నాడు. తనను తాను నిందించుకున్నాడు సోమయాజులు.

ఏ మంద బుద్ధిలో ఉన్నారో, చేయబోయే అఘాయిత్యం చెవిన వేశారు. లేకుంటే తను బిడ్డను కాపాడుకొనే తెలివితో ఎల్లా వుంటుంది? మామూలుగా నిద్ర పోయేది! తెల్లవారాక పక్కమీద పిల్లవాడు లేకపోవడం చూసి గుండె బాదుకొనేది! ఆయనగారి మంచితనాన్ని మనస్సులో మెచ్చుకుంది శారద.

గదిలో లైటు లేకుండా — కళ్ళు నిద్రకోసం ప్రాకులాడతాయని సోమయాజులు పనిగట్టుకొని పట్టెమంచం మీదనుంచి లేచి, లైటు ఆర్పి-మళ్ళీ మెల్లగా పడుకున్నాడు. కాని ఆమె మటుకు నిద్ర పోలేదు.

పై పెచ్చు గదిలోని చీకటి - సోమయాజులే, ఆలోచిస్తో... మగతగా కన్నుమూసి నిద్రలో దొర్లిపోయాడు. తీరా అతనికి మెలకువ వొచ్చేసరికి ఒంటిగంట దాటింది. గబగబా మంచంమీదనుంచి లేచి, ఈసరికి శారద గాఢనిద్ర వుంటుందనుకుంటూ—లైటు వేశాడు.

ఆశ్చర్యం! సోమయాజులు నిద్రమత్తు కొలిమిలో పెట్టిన కొడవలికి తుప్పు వొదిలినట్లు వొదిలింది. శారదా, రామూ మంచంమీద లేరు. ఎక్కడి కెళ్ళారు?

వీధివాకిలి తెరిచి ఉంది.

శారద ఎంతపని చేసింది! తనని నిద్రపోనిచ్చి పిల్లవాణ్ణి తీసికొని ఎక్కడికో వెళ్ళింది! ఎక్కడ కెళ్ళింది? ఎక్కడ కెళ్ళినా తను ఆ పిల్లవాణ్ణి వెదకి — హుస్సేన్ సాగర్‌కు సమర్పించలేకపోతాడా? మోసపోయాడు. తనే ముందుగా

నిద్ర బోతానని వూహించలేదు. అయినా శారద తన కంట బడకుండా—ఎంతదూరం వెళుతుందిలే! అనుకుంటూ సోమయాజులు వీధి వాకిట్లోకి వొచ్చాడు.

అతన్ని మరీ ఆశ్చర్య పర్చిన సంఘటన ఇంకోటి జరిగింది.

ఆ అర్థరాత్రిలో చంకలో మూడేళ్ళ పిల్ల నెత్తుకొని—సీతారామారావు భార్య సత్యవతి వీధి గుమ్మంలో ఎదురైంది. ఆమె కన్నీళ్ళతో అతని కాళ్ళను పెనవేసుకుంది.

"మీరు నాకు పతిభిక్ష పెట్టాలి. నాపైన గల అపవాదును తొలగించి, నా నిర్దోషత్వపు నిరూపణకు నిదర్శనంగా నిలబడాలి. ఆయనగారు అపోహకు గురియై, మూడేళ్ళ ముద్దుల కూతుర్ని సముద్రం పాలు చేస్తానని భీషణ ప్రతిజ్ఞ చేశారు. ఇట్లా తప్పించుకు తమ వద్దకు వచ్చాను." అన్నది సత్యవతి ఏడ్పును దిగమ్రింగలేక.

సోమయాజులు లేల ఇంటి చూరుకు కొట్టుకున్నట్టు దిమ్మ తిరిగిపోయాడు. ఆమెను వారిస్తూ—

"ఏం జరిగిందో చెప్పు. చేయదగిన సహాయమంతా చేస్తాను" అన్నాడు.

"ఎవడో శ్రేయోభిలాషట. నా కాపురానికి కాలయముడులాగ దాపురించాడు. వాడు ఆయనగారికి ఓ లేఖ వ్రాస్తూ, అందులో మా అమ్మాయి మూడేళ్ళ నళినిలో మీ పోలికలున్నాయని, ఈ విషయం అమ్మాయిని పరీక్షగా

కథా నిలయం
5949

చూస్తే బోధపడగలదనీ వ్రాశాడు. చూడండి. ఎంత ఘోరమైన అపవాదో! మీకు నాకూ సంబంధ మున్నదట. ఆ లేఖ చూశాక ఆయనగారు పూర్తిగా మారిపోయారు. నన్ను శంకించారు. పిల్ల ముందు కూర్చుని గంటలసేపు పోలికల్ని గమనించారు. నిజం చెప్పమని నన్ను నానా బాధలూ పెట్టారు. నేనేం చెప్పేది? ఏ పాపమూ యెరగనని యెంత వేడుకున్నా ఆయనగార్ని నమ్మించలేక పోయాను. చివరకు పిల్ల ఇంట్లో వుంటే తనకు శాంతిలేదనీ, సముద్రంలో పారవేస్తాననీ గట్టిగా చెప్పారు. నాకు ఆయనగారు అంతపనీ చేస్తారని భయంవేసి, మీ దగ్గరకు వొచ్చాను. మీరైనా ఆయనగార్ని నమ్మించి-మనస్సు మార్చాలి" అన్నది సత్యవతి.

సోమయాజులు నిముషంసేపు నిశ్శబ్దగా ఆలోచించాడు. యదార్థం కళ్ళముందు నిలిచింది. రెండు లేఖలూ ఒక్కటే! సందేహంలేదు. ఒక్కడు వ్రాసిందే! తనకీ సత్యవతికీఉన్న సంబంధం ఎంతవరకు వాస్తవమో, తనకు తెలుసుగా? ఇందులోనే తెలిసిపోయింది _ ఆ లేఖ బూటకమని. శారదకూడా పిల్లవాడ్ని రక్షించుకొనేనిమిత్తం సీతారామారావు దగ్గరకు వెళ్ళివుంటుంది. అక్కడ అతను ఆ లేఖ అబద్ధమని యిట్టే గ్రహిస్తాడు. కుటుంబాల్లో ఎంత కల్లోలం చెలరేగింది! పరిస్థితులు త్వరగా ఎంత పరిణామాన్ని రూపొందించుకున్నాయి! ఎవ్వడీ శ్రేయోభిలాషి? ఇద్దరికీ యిలా లేఖలు వ్రాసి, చక్కని సంసారాల్లో చిచ్చుపెట్టడంలో అతని అభిలాషఏమిటి? ఎంతో ఆత్మవిశ్వాసంతో దాంపత్య జీవనం

గడిపే దంపతులు కూడా – పరిస్థితులు అట్లాంటి దశలోకి వొచ్చినప్పుడు, భార్యపట్ల ఎంత అవివేకంగా, మూర్ఖంగా, దయారహితంగా ప్రవర్తిస్తారో తెలుసుకోవటానికి ఎవ్వరేనా ఈ తమాషా చేసేరేమిటి, ఖర్మ!' అనుకున్నాడు సోమయాజులు, సత్యవతిని ఇంట్లోకి తీసి కెళ్ళుతూ.

— జ్యోతి